ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.32 | సహర్ : 5.01 (ఆదివారం)
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శనివారం 16 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	197	224
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 24.4

పంటలు.. గొంతులు.. ఎండుతున్నాయ్



రాజాపేట మండలంలో ఎండిన పంటపొలాన్ని పశువుల మేతకు కోస్తున్న రైతు

దేవరకొండలో నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

» ఒట్టిపోతున్న బోర్లు » సాగునీరే కాదు తాగునీటికీ కటకటే » పశువులకు మేతగా పంటపొలాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఒక వైపు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడు వర్షాలు తక్కువవడంతో చెరువులు, కుంట ల్లో నీరు అంతంతగానే చేరింది. భూగర్భజలాలు రోజు రోజుకు అడుగంటిపోవడంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. బోర్లు, బావుల కింద సాగుచేసిన పైరు ఎండి పోతోంది. పంటలను రక్షించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎండిన వరి పైరు పశువులకు మేతగా మారుతుండడంతో రైతు వేదన వర్ణనాతీతంగా మారుతోంది. పంటలు ఎండి పోతుండడంతో కూలి దొరకక మరో వైపు కూలీలు పనులు వెతుక్కుంటూ సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నాయకులు

రైతులకు పరిహారం చెల్లించాలి

సూర్యాపేట(కలెక్టరేట్): వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండి రైతులు నష్టపోయారని వారికి ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. యాసంగిలో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద, ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద వరి సాగు చేసిన పొలాలకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోవడంతో నీరులేక సాగు చేసిన పంటలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల రజిత, మేదర్లమెట్ల వెంకటేశ్వర్‌రావు, దేవరం వెంకట్‌రెడ్డి, మందడి రాంరెడ్డి, సత్యనారాయణ, వీరాంజనేయులు, కోటాగోపి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నర్సింహారావు, రవి, ధనియాకుల శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, కృష్ణ, రాములు, ఏల్లయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటికీ సంకటమే..

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో ప్రధానంగా చందంపేట, దేవరకొండ, నేరేడుగొమ్ము, డిండి మండలాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంది. నియోజకవర్గంలో 480 గ్రామాలు ఉండగా, 248 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందని అధికారులు ముందస్తుగా గుర్తించారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని మోత్యతండా, కంభాలపల్లి, చిత్రియాల, తెల్‌దేవరపల్లి, కాచరాజుపల్లి, రేకులగడ్డ, పెద్దమూల, కొండమల్లేపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది.

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దేవరకొండ రోడ్డులో గల బీసీకాలనీలో 20 రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. 20 రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగేందుకు నీరు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఉన్న మోటారు దాదాపు ఏడు నెలల నుంచి మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పశువులకు మేతగా వరి పొలం



పశువులను మేపుతున్న రైతు అయిలయ్యయాదవ్

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లింగోజీగూడకు చెందిన రైతు సంకమడ్డి అయిలయ్యయాదవ్ ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. అందులో నాలుగు ఎకరాలు సొంత పొలం, పక్కనే మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. వానా కాలంలో ఈ ఆరు ఎకరాల పొలంలో వరి పంటను సాగు చేయగా, మరికొంత సాగు నీరు మిగులు బాటుగా ఉన్నట్లు అనిపించింది. దీంతో ఆ రైతు యాసంగిలో కూడా ఆరు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాడు. సంక్రాంతి పండుగ (2024 జనవరి 15) వరకు సాగు నీరు వరి పంట పొలానికి సరిపడా లభించింది. ఇక అక్కడి నుంచి రెండు బోర్లలో రోజు రోజుకు నీరు తగ్గిపోవడం కనిపించింది. బోర్లలో నీరు 50శాతానికి పైగా తగ్గి పోవడంతో కౌలుకు తీసుకున్న రెండు ఎకరాల వరి పంట పొ లానికి నీరు అం దక ఎండిపోవడం ఆరంభమైంది. రెండెరాల వరి పూర్తిగా ఎండిపోవడంతో తన పశువులను మేపుతున్నాడు.

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేట మండలం బొం దుగుల పారుపల్లి, బూరుగుపల్లి, చల్లూరు, జాల, సింగారం గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంట పొలాలు ఎండి పోతున్నాయి. కోతుల బాధతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించకుండా వరి పంటలు సాగు చేశారు.

కౌలు రైతుకు సాగు నీటి కష్టాలు

భువనగిరి రూరల్: కరెంట్ సరఫరాలో అంతరాయం భూగర్భజలాలు అడుగంటుతుండడంతో రైతులకు సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన కౌలు రైతు కాసాని వెంకటేష్ రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. 15 రోజుల నుంచి ఎండలు తీవ్రమవుతుం డడం, కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటి రెండు బోర్లలో నీరు సక్రమంగా పొలాల్లోకి రాకపోవడంతో ఎకరం పొలం ఎండిపోయింది. కాగా గత్యంతరం లేని పరిస్థితుల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నాడు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1000 చొప్పున ఉదయం రెండు, సాయంత్రం రెండు ట్యాంకర్లు రోజుకు నాలుగు ట్యాంకర్లతో నీటిని పోస్తూ ఉన్న ఎకరం పొలాన్ని సంరక్షించుకుంటున్నాడు. మరో నెల గడిస్తేనే పంట చేతికి వస్తుందని పేర్కొంటున్నాడు. ఈ ప్రాంత రైతులకు సాగు నీటిని అందించే విధంగా పాలకులు కృషి చేయాలని కౌలు రైతు విజ్ఞప్తి చేస్తున్నాడు.

పంట ఎండుతోంది.. ఆదుకోండి

నాకు మూడున్నర ఎకరాల భూమి, బోరు బావి ఉం ది. మూడున్నర ఎకరాలు వరి సాగు చేశాం. కోతుల బెడదతో వేరే పంటలు వేసుకోలేక వరినే సాగు చేశాం. ఎకరానికి రూ.30వేలు పెట్టించి పంటను సాగు చేశాం. కాగా భూగర్భజలాలు అడుగంటడంతో బావి పూర్తిగా ఎండిపోయింది.

- కరుణాకర్, రైతు, బొందుగుల,రాజాపేట.



కరువు వచ్చింది.. పని పోయింది

దామరచర్ల: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో కూలీలకు ఉపాధి కరువైంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా సరైన పంటలు ఎండిపోతుండడంతో కూలీలకు పనులు దొరకడం లేదు. గతంలో ఎన్నడూలేని కరువు పరిస్థితులతో వ్యవసాయ కూలీల పరిస్థితి దారుణంగా మారింది.పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోతుండడం.. అరకొరగా పండిన పత్తితీసే పనులు సైతం పూర్తవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కూలీలు గుంపులుగా ఏర్పడి ఆటోలు,ట్రాక్టర్లపై ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా అంబాపురం, గోగులపాడు, కాసారం, పులిపాడు, రామాపురం తదితర ప్రాంతాలకు మిర్చి కూలీలకు నిత్యం వందల సంఖ్యలో మహిళలతోపాటు చిన్నారులు తరలివెళ్తున్నారు.

కూలి కోసం సుదూర ప్రాంతాలకు

పనులు దొరకకపోవడంతో గత్యంతరం లేక కూలీలు ఆటోలు, ట్రాక్టర్లలలో ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా సరిహద్దు ప్రాంతమైన దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాలతోపాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోని పలు మండలాల నుంచి సుమారు 50కిలోమీటర్ల దూరప్రాంతాలకు కూలి పనులకు వెళ్తున్నారు. కూలీలు ప్రయాణించే వాహనాలకు ఎక్కువ మొత్తం చెల్లించి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తక్కువ మందితో గిట్టుబాటు కావడం లేదని వాహనదారుల సామర్థ్యానికి మించి కూలీలను ఎక్కిస్తున్నారు. ఈ ప్రాంతంలో పనులు లేకపోవడంతో నిత్యం వందలాది మంది కూలీలు పల్నాడు జిల్లాకు పనులకు వెళ్తుండడంతో ఆ ప్రాంత రైతులు కూలీ రేట్లను తగ్గించారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల కు వెళ్తే రోజుకు రూ.300 వరకు కూలి ఇస్తుండగా అందులో సుమారు రూ.100 నుంచి రూ.60 వరకు రానుపోను చార్జీలకే పోతున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పని కోసం గుంటూరు జిల్లాకు ట్రాక్టర్‌లో వెళ్తున్న కూలీలు

నీరు లేక పైరు ఎండుతోంది

ఆత్మకూరు(ఎస్), మార్చి 15: పొట్ట దశలో ఉన్న వరి పైరు నీరందక ఎండుతోందని, ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్, చివ్వెంల మండలాలకు చెందిన 50మందికి పైగా రైతులు శుక్రవారం ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్ తండా ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ బ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పెన్‌పహాడ్, చివ్వెంల మండలాలకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఎస్సారెస్పీ నీటిని ఆత్మకూర్(ఎస్), మోతె మండలాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఎస్సారెస్పీ అధికారుల పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తూ, కోదాడ నియోజవర్గానికి ఎస్సారెస్పీ నీటిని తరలిస్తున్నారని తెలిపారు. పొట్ట దశలో ఉన్న వరి పైరు నీరు అందక ఎండిపోతుందని, వెంటనే నీటిని అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. రైతుల రాస్తారోకోతో సూర్యాపేట - దంతాలపల్లి రోడ్డులో ఇరువైపులా వాహనాలు అరగంట పాటు అధిక సంఖ్యలో నిలిచాయి. విషయం తెలుసుకున్న ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ సైదులు సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పెన్‌పహాడ్, చివ్వెంల మండలాలకు ఎస్సారెస్పీ నీరు విడుదల చేసేవిధంగా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ధర్నాలో రైతులు తొగరు లింగయ్య, బాదె సీతయ్య, కరుణాకర్, శంకర్, భాస్కరాచారి, సైదులు, చారి, వెంకటేశ్వర్లు, అజయ్, శ్రీను, పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న పెన్‌పహాడ్ మండలానికి చెందిన రైతులు



» మురళీకృష్ణుడిగా దర్శనమిచ్చిన యాదగిరీశుడు
» రాత్రి పొన్న వాహనంపై చిలిపి కృష్ణుడి చిద్విలాసం



యాదగిరిగుట్ట, మార్చి15: చేతిలో సుమధుర మృదుగానాల పిల్లన గ్రోవి.. మెడలో స్వర్ణ, వజ్ర, ముత్యాల కంఠాభరణాలు.. ఒంటిపై పట్టుపీతాంబర వస్త్రాలు.. వివిధ సుగంధ పరిమళ పుష్పమాలలు ధరించి తన దివ్యమంగళరూపంతో సకల జనావళిని సమ్మోహన పరుస్తూ యాదాచల నృసింహుడు శుక్రవారం మురళీ కృష్ణుడిగా భక్తులకు దర్శనమిచ్చాడు. విశ్వశాంతి.. లోక కల్యాణంకోసం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు తిరుకల్యాణ వేడుకల్లో పెండ్లికొడుకుగా ముస్తాబైన స్వామివారు శ్రీకృష్ణాలంకారంలో విశేషసేవలు అందుకున్నాడు. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో విశిష్టమైన శ్రీకృష్ణుడి అలంకారంలో నృసింహుడిని స్తుతిస్తూ అర్చకులు, రుత్వికబృందం పారాయణాలు చేస్తుండగా.. పుష్పాలంకృతమైన పల్లకి సేవలో అర్చకబృందం వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు వేదికపై అధిష్ఠింపజేసిన అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవ వైదిక పూజాపర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటచార్యులు, అర్చకబృందం, వేదపండితులు, రుత్వికులు నిర్వహించారు. ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, గుట్ట మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీ తోటకూరి అనురాధ, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్న వాహనంపై చిద్విలాసం

భక్తపరాయణుడు, జగద్రక్షకుడు శ్రీమహావిష్ణువు లోక కల్యాణంకోసం అవతరించిన అవతార రూపాల్లో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో దివ్య వాహన సేవల్లో పూజలు అందుకుంటున్నారు. ప్రధానాలయ తిరువీధుల్లో శుక్రవారం రాత్రి స్వామివారు పొన్నవాహన సేవపై ఊరేగుతూ భక్తజనులకు దర్శనమిచ్చాడు. పొన్న చెట్టు నీడలో చిలిపి కృష్ణుడు చేసిన రాసలీల క్రీడల వైభవాలు భాగవతంలో పేర్కొన్న రీతిలో ఈ వాహన సేవ ఆహ్లాదకరంగా నిర్వహించారు. పొన్నవృక్షం వాసుదేవ స్వరూపమని సకల భక్తులకు ఆశ్రయం కలిగించే ఈ వాహన సేవలో లక్ష్మీనరసింహుడిని భక్తులు దర్శించుకుని తరించారు. ఈ మహావృక్షం నీడలో సమతుల్యస్థితి కలిగి భక్తులకు సుఖసంతోషాలు, సర్వ సౌఖ్యాలు సంప్రాప్తిస్తాయనేది భక్తుల విశ్వాసం.



బీఆర్‌ఎస్‌లో 'గుత్తా' కలకలం

వైఫల్యానికి సంస్థాగత నిర్మాణలోపమే కారణమంటూ వ్యాఖ్యలు

ఎమ్మెల్యేలు కేంద్రంగా రాజకీయాలు తప్పేనంటూ విమర్శలు

నల్లగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీఆర్‌ఎస్‌లో సంస్థాగత నిర్మాణలోపం ఉందని, సీఎంగా రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో సంతృప్తి ఉందంటూ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి. శనివారం నల్లగొండలోని తన స్వగృహంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సుఖేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పైనా, తన కుమారుడు అమిత్‌రెడ్డి రాజకీయ పయనంపైనా పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్‌లో సంస్థాగత నిర్మాణంలో లోపం ఉంది. ఎమ్మెల్యే కేంద్రంగా రాజకీయాలు చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ కూడా 1989లో, 1994లో అధికారం కోల్పోయినా ఆ పార్టీ సంస్థాగత నిర్మాణం, క్రమశిక్షణ కలిగి ఉండడంవల్లే బలంగా నిలబడి ప్రతిపక్ష పాత్ర పోషించగలిగిందన్నారు. బీఆర్‌ఎస్‌లో అవి లోపించాయని విమర్శించారు. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారు. ఇంకా ఎవరుంటారో పోతారో తెలియదు. అధికారం లేకపోతే పార్టీ బలహీనమయ్యే పరిస్థితి ఏర్పడడానికి పార్టీ నేతల నడుమ సమన్వయలోపమే ప్రధాన కారణంగా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తాను పదవిలో ఉన్నప్పుడే బీఆర్‌ఎస్ నుంచి పలుమార్లు ఆహ్వానిస్తేనే ఆనాడు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లానని తెలిపారు. కనీసం రెండు నెలల ముందే లోక్‌సభ అభ్యర్థుల్ని బీఆర్‌ఎస్ ప్రకటించినట్లైతే బలమైన పోటీ ఇచ్చి ఉండేదని, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు.

బీఆర్‌ఎస్ నుంచి అమిత్ పోటీ చేయడు

బీఆర్‌ఎస్‌నుంచి తన కుమారుడు అమిత్‌రెడ్డి పోటీ చేయడం లేదని, ఆయనకు కాంగ్రెస్ నుంచి ఆఫర్ వచ్చిన మాట వాస్తవమేనని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న తాను ఏ పార్టీలో చేరనని పేర్కొన్నారు. అమిత్‌రెడ్డి పార్టీ మారే అంశం తనకు తెలియదని, ఆయన పార్టీ మారరని, అన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. మొత్తంగా చిట్‌చాట్ పేరుతో సుఖేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం, మాజీ ఎమ్మెల్యేల నడుమ సమన్వయలోపముందని, సుతిమెత్తగా విమర్శలకు దిగడంతో పార్టీ నుంచి ఎలాంటి స్పందన వస్తుందోననే ఆసక్తి నెలకొంది. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ మరికొన్ని గంటల్లో వస్తుండడం, ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్‌పై మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయడంతో ఈ ప్రభావం బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎంపికపై ఏమాత్రం ఉంటుందోననే చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే ఒకరు ఇప్పటికే పార్టీ ఫిరాయించి బీజేపీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలవగా, మరో మాజీ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్‌కు లైన్లో ఉన్నారని తెలుస్తుంటే, గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు సైతం కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ నేతలు, కేడర్, ఓటుబ్యాంకుపైనా కన్నేసిన కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే ఆపరేషన్ కొనసాగిస్తుంటే, కేడర్ని, ఓట్‌బ్యాంకుని కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ ఎలాంటి వ్యూహం అనుసరించబోతోందోనని, అభ్యర్థుల ఎంపికలో బీఆర్‌ఎస్ ఇచ్చే ట్విస్ట్ ఎలా ఉంటుందోనని రాజకీయవర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారైతే తప్ప ఈ ఊహాగానాలకు, వ్యాఖ్యానాలకు ఫుల్‌స్టాప్ పడే అవకాశం లేదు.

» నిరసనలు



» సంబురాలు



కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శుక్రవారం భువనగిరిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ ఫ్లెక్సీని దహనం చేశారు. కవిత అరెస్ట్‌ను హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, బీజేపీ కార్యక్రమంలో భువనగిరి మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌గుప్తా పాల్గొన్నారు.

● భువనగిరి టౌన్

హరితహారం లక్ష్యాన్ని సాధించాలి

అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్



భువనగిరి అర్బన్, మార్చి 15: హరితహారంలో మొక్కలు నాటేందుకు వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో సాధించాలని అదనపు కలెక్టరు(రెవెన్యూ) బెన్ షాలోమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై హరితహారం లక్ష్యాన్ని నిర్దేశించి మాట్లాడారు. వచ్చే జూన్, జూలై నెలల్లో వర్షాలకనుగుణంగా మొక్కలు నాటాలని, శాఖలవారీ లక్ష్యాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారి పద్మజారాణి, డీఆర్డీవో ఎం.ఎ.కృష్ణన్, జడ్పీ సీఈవో శోభారాణి, వ్యవసాయ అధికారి అనురాధ, పంచాయితీ అధికారి సునంద, ఉద్యానవన అధికారి అన్నపూర్ణ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా బెన్‌షాలోమ్ బాధ్యత స్వీకరణ

అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బెన్ షాలోమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హుస్నాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన ఆయన ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ ఆదేశాలతో పదోన్నతిపై ఇక్కడ విధుల్లో చేరారు.

నేత్రపర్వంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ


అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 15:యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం స్వామికి సువర్ణపుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవ పర్వాలు నేత్రపర్వంగా సాగాయి. సుప్రభాతంతో నిత్యపూజలు ఆరంభించిన ఆచార్యులు గర్భాలయంలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను 108బంగారు పుష్పాలతో అర్చించారు. పంచామృతాలతో అభిషేకం, అర్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, మహామండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్యార్చనలు, రుద్రహవనం నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవ పర్వాలు నేత్రపర్వంగా సాగాయి. ఆండాల్ అమ్మవారిని దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించి అద్దాల మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,93,505 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామి సన్నిధిలో పదో తరగతి విద్యార్థుల పూజలు

యాదగిరీశుడి సన్నిధిలో శుక్రవారం జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు తమతమ హాల్‌టికెట్లతో వచ్చి ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో తమకు ఉత్తమ ర్యాంకులను ప్రసాదించాలని దేవదేవుడిని వేడుకున్నారు. అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

గుట్ట పులిహోర ప్రసాదంలో ఎలుక కళేబరం

సోషల్ మీడియాలో వైరల్


ఎలుక కళేబరం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఓ భక్తుడు కొనుగోలు చేసిన పులిహోర ప్రసాదంలో ఎలుక కళేబరం వచ్చిందని శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వైరల్ అయ్యింది. సోషల్ మీడియా ద్వారా సదరు భక్తుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సదరు భక్తుడు కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నాడు. దర్శనానంతరం స్వామివారి ప్రసాదాల విక్రయశాలలో పులిహోర ప్రసాదాలు కొనుగోలు చేసి ఆలయ ఆవరణలో తినేందుకు ఉపక్రమించాడు. పులిహోర ప్రసాదం ప్యాకెట్ విప్పగానే అందులో ఎలుక కళేబరం కనిపించటంతో కొనుగోలు చేసిన ప్రసాదాలను పక్కన పడేసినట్లు పేర్కొన్నాడు. భక్తులు ఎంతో భక్తి ప్రపత్తులతో కొనుగోలు చేసే ప్రసాదాల తయారీపై దేవస్థాన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రసాదాల తయారీలో నాణ్యత లోపించిందని సదరు భక్తుడు ఆరోపించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వలిగొండ, మార్చి 15 : మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది యువకుడు బలవన్మరణం చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వలిగొండ మండల కేంద్రానికి చెందిన మోటం అనిల్(23) వృత్తిరీత్యా కూలీ. నాలుగేళ్ల కిందట ఓ యువతితో వివాహమైంది. వారికి సంతానం కలగకపోవడంతో నాలుగు నెలల కిందట భార్యాభర్తలు విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి అనిల్ మద్యానికి బానిసయ్యాడు. స్థానిక మార్కెట్‌యార్డులో గురువారం రాత్రి చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


ప్రవళిక(ఫైల్)

చిలుకూరు, మార్చి 15: ప్రమాదశాత్తు విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన కొండా సతీష్ భార్య ప్రవళిక(26) శుక్రవారం ఇంట్లో దుస్తులు ఉతికి ఇనుప దండెనికి ఆరవేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన భర్త సతీష్ వెంటనే ఇంట్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. వెంటనే ప్రవళికను కోదాడ వైద్యశాలకు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రవళిక తండ్రి నందిగామ గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎల్లుండి పెళ్లి.. పెళ్లికుమార్తె అదృశ్యం


బబిత

తుర్కపల్లి, మార్చి 15 : రెండు రోజులైతే పెళ్లి.. పెళ్లిపత్రిక ఇస్తానని వెళ్లిన పెళ్లికుమార్తె అదృశ్యమైంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ తక్యుయెద్దీన్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన జూపల్లి బబిత(19) భువనగిరి నవభారత్ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. బబితకు పెళ్లి సంబంధం కుదిర్చి ఈ నెల 17న వివాహం చేయడానికి కుటుంబసభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని భావించిన బబిత మనస్తాపానికి గురై ఈ నెల 14న తన స్నేహితురాలికి పెళ్లిపత్రిక ఇచ్చి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బబిత ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తండ్రి జూపల్లి బాలయ్య ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హోటల్‌కు సామాగ్రి తీసుకొస్తానని వెళ్లి..

హుజూర్‌నగర్, మార్చి 15: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా కేంద్రానికి చెందిన కే కిషోర్ బతుకుదెరువు కోసం హుజూర్‌నగర్‌కు వచ్చి టిఫిన్ సెంటర్‌లో వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సొంతంగా హోటల్ పెట్టాలన్న ఆలోచనతో ఉన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన డబ్బులు తీసుకుని కుర్చీలు, బల్లలు తెచ్చేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు భార్య అనూషకు చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత నుంచి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కిషోర్ అదృశ్యంపై భార్య అనూష ఫిర్యాదు చేసిందని ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గరిడేపల్లి, మార్చి 15 : అక్రమంగా రవాణా చేస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్ఐ ఈట సైదులు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లిలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారంతో గురువారం తెల్లవారుజామున మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా గ్రామం నుంచి టీఎస్04యూఈ 0918 వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనంలోని ఇద్దరిని విచారించగా ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా మాచర్ల మండలం ఖంభంపాడు గ్రామానికి చెందిన కంద్రకొండ గోపి, గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన కందిబండ అంజయ్యలు మరికొంత మంది కలిసి కొంతకాలంగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. సీఐ చరమందరాజు కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో ఎస్ఐ-2 సలిగంటి నరేష్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సాగర్‌లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు


సాగర్‌లో అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్, మార్చి 15: ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన వద్ద పోలీసులు శుక్రవారం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సరిహద్దులో తనిఖీలు చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు చెక్‌పోస్టు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ వైపునకు వచ్చే వాహనాలతో పాటు తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపునకు వెళ్లే వాహనాలను 24 గంటల పాటు సిబ్బందితో తనిఖీలు చేయించనున్నట్లు వారు పేర్కొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

నాగారం, మార్చి 15 : బీసీలకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్ర శుక్రవారం సూర్యాపేట జిల్లా నాగారం మండలానికి చేరుకుంది. ఓబీసీ నాయకులు కన్నెబోయిన అంజయ్య ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా చట్టసభల్లో తీర్మానం చేసి బిల్లును ఆమోదించాలన్నారు. హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ మాట్లాడుతూ బీసీల కులంలో పుట్టిన పండుగ సాయన్న, సర్వాయి పాపన్నలు రాజ్యాధికారం కోసం ఆనాటి రాజులను ఎదురించి బహుజన రాజ్యాన్ని స్థాపించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, పటేల్ వనజ, వెలుగు వనిత, మాజీ ఎంపీపీ తాటికొండ సత్తయ్య, ములకపురి శ్రీకాంత్, బయ్యం వెంకన్న, కొత్త గట్టు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మిలిపిలో శిలాశాసనం

ఫణిగిరి మ్యూజియంలోని కళాఖండాలపై ఆనవాళ్లు


మ్యూజియంలోని రెండో శతాబ్దం నాటి శిల్పంపై ఉన్న బ్రహ్మిలిపి

నాగారం, మార్చి 15 : సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని చారిత్రక బౌద్ధక్షేత్రం ఫణిగిరిలోని పాలరాతి స్తంభంపై బ్రహ్మిలిపిని భారత పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్ పీ నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఫణిగిరిగుట్టపై గతంలో తవ్విన తవ్వకాల్లో లభించిన పాలరాతి స్తంభాన్ని ప్రస్తుతం ఫణిగిరి గ్రామంలోని మ్యూజియంలో భద్రపరిచారు. అయితే శిలపై భారత పురావస్తు శాఖ అధికారులు పరిశోధనలు జరిపారు. పాలరాతి స్తంభం క్రీ.శ. రెండో శతాబ్దం నాటి శిలాశాసనం అని, దానిపై ప్రాకృత, బ్రహ్మిలిపిలో చెక్కి ఉందని పురావస్తు శాఖ నిర్ధారించిందని పేర్కొన్నారు. ఆ శిలాశాసనంపై 'పదాని అపాతో నివసనం భారత కారపిత మితి' అని ఉందన్నారు. భారత అనే వ్యక్తి చేసిన బుద్ధ పాదాల దానం' అనే అర్థ వివరణ వచ్చేలా రాసి ఉందని పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపినట్లు డిప్యూటీ డైరెక్టర్ పీ నాగారాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రుణభాగ్యం ఆరేళ్లలో తొమ్మిది శాతమే

- ఏళ్లు గడుస్తున్నా అందని ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలు
- సూర్యాపేటలో జిల్లాలో దరఖాస్తుదారులు 9,879 మంది
- మంజూరు 894 మందికే...

సూర్యాపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. గడిచిన ఆరేళ్లలో తొమ్మిది శాతమే రుణాలు మంజూరు కావడం కార్పొరేషన్ తీరుకు అద్దంపడుతోంది. కార్పొరేషన్ రుణాల కోసం 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆ తర్వాత 2020-21లో దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది. ఎంచుకున్న యూనిట్ మేరకు రూ.లక్ష నుంచి రూ.నాలుగు లక్షల వరకు రుణాలను మంజూరు చేయాల్సి ఉంది. అయితే రెండు పర్యాయాల్లో కలిపి మొత్తం 9,879 మంది దరఖాస్తు చేసుకోగా 894 మందికి మాత్రమే ప్రభుత్వం రాయితీ రుణాలను మంజూరు చేసింది. గడిచిన కొన్నేళ్లుగా ఎస్సీ నిరుద్యోగులు రాయితీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. దారిద్ర్యంతో పోరాడుతున్న పేదలకు కార్పొరేషన్ అందించే సబ్సిడీ రుణాలు గొప్ప అవకాశం. కాగా వీటిని సద్వినియోగం చేసుకుని పేదరికాన్ని కొందరు వదిలించుకోగా, కొందరు ఆర్థికంగా మంచిస్థితికి చేరుకున్నారు. లక్ష్యం మంచిదైనా నిధుల లేమితో ముందుకు సాగడం లేదు. స్వయం ఉపాధి కోసం నిరుద్యోగ యువతకు అందించాల్సిన రాయితీ రుణాల మంజూరు ఎండమావిలా మారాయి.

ఏళ్లుగా ఎదురుచూపులు

ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తుదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు. రుణ మంజూరు ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారులకు ఎంపీడీవో కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు సైతం పూర్తి చేశారు. ఆ ప్రక్రియ ముగిసి ఏళ్లు గడుస్తోంది. ఆ తర్వాత ముందుకు సాగడం లేదు. ఇప్పటికీ దరఖాస్తుదారులు రాయితీ రుణాల కోసం కలెక్టరేట్‌లోని ఎస్సీ సంక్షేమం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి 2018-19లో ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లావ్యాప్తంగా 1,218 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2018 డిసెంబరు చివరి నాటికి 331 మంది మాత్రమే రాయితీ రుణం మంజూరు కాగా, మిగిలిన 887మందికి కాలేదు. ప్రభుత్వం నుంచి నిధుల కొరత కారణంగా రుణాలు మంజూరు కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. మొదటి విడత దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు చేయకుండానే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2020-21లో మరోసారి దరఖాస్తులను స్వీకరించింది.

2018-19లో దరఖాస్తు చేసుకోని నిరుద్యోగులు కూడా 2020-21లో విడతలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రెండో విడతలో మొత్తం 8,661 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఏడాదిలో దరఖాస్తుదారుల్లో కేవలం 563 మందికి మాత్రమే రాయితీ రుణం మంజూరైంది. ఇంకా 8,098 మందికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు కావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా రెండు పర్యాయాలు కలిపి 9,879 మంది దరఖాస్తు చేసుకోన్నారు. మొదటి విడతలో 331 మందికి, రెండో విడతలో 563 మందికి కలిపి మొత్తంగా 894 మందికి మాత్రమే రుణాలు మంజూరయ్యాయి. రెండు విడతల దరఖాస్తుల్లో కేవలం తొమ్మిది శాతం మాత్రమే రుణాలు మంజూరయ్యాయి.

చెప్పుల దుకాణం కోసం దరఖాస్తు చేశా



ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 2018లో దరఖాస్తు చేశా. చెప్పుల దుకాణం ఏర్పాటు కోసం రుణాన్ని అభ్యర్థించా. రూ.లక్ష రుణంలో రాయితీ వస్తుందని ఆశించా. కానీ ఆరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. నిధులు లేవని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరగా నిధులను విడుదల చేసి ఉపాధి కల్పించాలి.

● దోసపాటి విజయ్, ధర్మాపురం, పెన్‌పహాడ్ మండలం

ప్రభుత్వానికి నివేదించాం

ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 2018-19, 2020-21 రెండు విడతల్లో దరఖాస్తులు స్వీకరించాం. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశాం. అర్హులైన లబ్ధిదారులకు రావాల్సిన రాయితీ రుణాల వివరాలన్నింటినీ ప్రభుత్వానికి నివేదించాం. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ప్రభుత్వం రాయితీ రుణాలను మంజూరు చేసిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తాం. మా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఏమీ పెండింగ్‌లో లేవు.

● లావూరి కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

గంజాయి ముఠాల మధ్య ఆధిపత్య పోరు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 14 : గంజాయి ముఠాపై ఆధిపత్యపోరులో స్నేహితులే శత్రువులుగా మారారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని గంజాయి మత్తులో పరస్పరం ఒకరిపై మరొకరు జరుపుకున్న దాడుల్లో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి 11 మందిపై కేసులు నమమోదు కాగా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందని మేడబోయిన చక్రి, ఎలిశాల అఖిల్ స్నేహితులు. వీరిద్దరు మరికొంత మందితో కలసి తరచూ గంజాయి పీల్చేవారు. ఈ క్రమంలో చక్రి ధూల్‌పేట నుంచి గంజాయిని కొనుగోలు చేసి మిత్రులతో కలసి పీల్చడమే కాకుండా ఇతరులకు విక్రయించేవాడు. అయితే గత జనవరిలో చక్రి వద్ద గంజాయి పట్టుబడటంతో కేసు నమోదైంది. దీనికి తన స్నేహితుడైన అఖిల్ కారణమని అతడే పోలీసులకు సమాచారం అందించి ఉంటాడని చక్రి కక్ష పెంచుకున్నాడు. పలుమార్లు ఒకరికొకరు పరస్పరం దూషించుకోవడమే కాకుండా ఎవరికివారు వేర్వేరుగా గంజాయి ముఠాలను ఏర్పాటు చేసుకున్నారు. తరచూ గంజాయి పీల్చుతూ ఫోన్లలో తిట్టుకునేవారు. దీంతో వారి మధ్య దూరం మరింత పెరిగింది.

అంతమొందించాలనే ఉద్దేశంతో...

తనను పోలీసులకు పట్టించాడంటూ అఖిల్‌పై కక్ష పెంచుకున్న చక్రి అఖిల్‌ను అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చాడు. అందులో భాగంగా ఈ నెల 9న చక్రి తన బ్యాచ్‌తో కలసి అఖిల్ ఇంటి మీదకు వెళ్లి ఘర్షణకు దిగాడు. ప్రతిగా అఖిల్ కూడా తన బ్యాచ్‌తో కలసి చక్రి ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. దీంతో మరింత ఉద్రేకంతో చక్రి మరుసటి రోజు గ్రీన్‌హిల్స్ కాలనీ వెనుక భాగంలో తన బ్యాచ్‌కు చెందిన పట్టణానికి చెందిన మహ్మద్ సమీర్, దోటి ఉపేందర్, కందికట్ల అభిరామ్, గజ్జి హర్షవర్ధన్, వట్టికోట శేఖర్, కొమ్మనలపల్లి మహేష్‌లతో కలసి గంజాయి సేవించి మత్తులో అఖిల్‌ను చంపుతామంటూ బెదిరించారు. దీంతో అప్పటికే మత్తులో ఉన్న అఖిల్ కూడా తన బ్యాచ్‌కు చెందిన సురారపు రాజుకు చెప్పగా అతడు తనవెంట నవనీత్, షోయబ్ అనే మరో ఇద్దరితో కలసి కత్తులను తీసుకొని అఖిల్‌తో కలసి చక్రి బ్యాచ్‌వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ ఇరు బ్యాచ్‌లకు మాటామాటా పెరిగి కత్తులతో దాడికి దిగారు. ఈ దాడిలో దోటి ఉపేందర్‌తో సూరారపు రాజులకు తీవ్రగాయాలు కాగా చక్రికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే సమయానికి అందరూ పారిపోగా సూరారపు రాజు తీవ్రగాయాలతో పోలీసులకు పట్టుబడ్డాడు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

ఈ సంఘటనలో ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రెండు బ్యాచ్‌లలోని 11 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో చక్రి బ్యాచ్‌లోని ఏడుగురిపై హత్యాయత్నం కేసుతో పాటు అట్రాసిటీ కేసు నమోదుచేయగా అఖిల్ వర్గంలోని నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన నవనీత్ నుంచి రూ.5 వేల విలువైన 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అయితే మొత్తం 11 మంది నిందితుల్లో మేడబోయిన చక్రి, మహ్మద్ సమీర్, కందికట్ల అభిరామ్, గజ్జి హర్షవర్ధన్, వట్టికోట శేఖర్, కొమ్మనలపల్లి మహేష్‌లతో పాటు గద్దెపాక నవనీత్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించగా సూరారపు రాజు, అలిశెట్టి అఖిల్, ఎండీ షోయబ్, దోటి ఉపేందర్‌లు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

మహిళ హత్యపై కొనసాగుతున్న విచారణ

దేవరకొండ, మార్చి 15: నల్లగొండ జిల్లా దేవరకొండ బస్టాండ్ సమీపంలో శిథిలావస్థకు చేరిన భవనంలో ఈ నెల 13న రాత్రి జరిగిన మహిళ హత్య కేసులో దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. బస్టాండ్ సమీపంలోని దుకాణాల్లో ఏర్పాటుచేసిన సీసీకెమెరాల ఫుటేజ్‌లను సేకరించి పరిశీలిస్తున్నారు. నల్లగొండ నుంచి పోలీస్ జాగిలాలను, క్లూస్‌టీంను రప్పించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. హత్యలో ఎంతమంది పాల్గొన్నారన్న కోణంలో విచారణ చేస్తుండగా ఇప్పటికే ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. త్వరలో నిందితులను పట్టుకుంటామని, పూర్తివివరాలు తెలియజేస్తామని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

బైరవునిబండ జడ్పీ స్కూల్‌లో చోరీ

శాలిగౌరారం, మార్చి 15: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం బైరవునిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దాదాపు రూ.40వేల విలువైన బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు నాంపల్లి శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మన ఊరు-మన బడి పథకం కింద మంజూరైన ఐఎఫ్‌పీ ప్యానల్‌కు సంబంధించిన 6 ఎక్సైడ్ 12వీ బ్యాటరీలను 8వ తరగతి గదిలో అమర్చారు. శుక్రవారం ఉదయం పాఠశాల తెరిచేందుకు వెళ్లగా తరగతి గది తాళం పగులగొట్టి ఉంది. దీంతో గదిలోకి వెళ్లి చూడగా బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారని ఎస్ఐ ఐలయ్య తెలిపారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు

అగ్ని ప్రమాదంలో బత్తాయి చెట్లు దగ్ధం

హాలియా, మార్చి 15: నల్లగొండ జిల్లా అనుముల మండలం తిమ్మాపురం రహదారిలో రోడ్డు వెంట గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పంటించడంతో మంటలు వ్యాపించాయి. దీంతో తిమ్మాపురం గ్రామానికి చెందిన గుర్రం ప్రభాకర్‌రెడ్డికి చెందిన తోటలో కొన్ని చెట్లు, మోటార్లు కాలిపోయాయి. సుమారు రూ.50వేల నష్టం జరిగినట్లు రైతు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సకాలంలో ఫైరింజన్ రావడంతో తోట పూర్తిగా దగ్ధం కాకుండా మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు.

వాహన దొంగల అరెస్టు

భువనగిరి టౌన్, మార్చి 15 : ఇద్దరు వాహన దొంగలను అరెస్టు చేసినట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక వినాయకచౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టిన క్రమంలో యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన భువనగిరి శ్రీనివాస్, భువనగిరి పట్టణంలని ఇందిరానగర్‌కు చెందిన గాయపాక యాదగిరి బైక్‌పై వెళ్తు అనుమానాస్పద స్థితిలో పట్టుబడ్డారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆలేరు, భువనగిరి ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసి విక్రయించడానికి వెళ్తున్నట్లు నిర్ధారించుకున్నారు. దీంతో ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పుస్తెల తాడు అపహరణ

భువనగిరి రూరల్, మార్చి 15 : మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరించిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బస్వాపూర్ గ్రామానికి చెందిన పులి చంద్రకళ భర్తతో కలిసి మోపెడ్‌పై భువనగిరి రైతుబజారు నుంచి స్వగ్రామం బస్వాపూర్‌కి వస్తుండగా మార్గమధ్యలో ప్రాణహిత-చేవెళ్ల కాల్వ వద్దకు రాగానే వెనుక వైపు నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి చంద్రకళ మెడలోంచి రెండు తులాలబంగారు పుస్తెలతాడును లాక్కుని పారిపోయాడు. పుస్తెలతాడు విలువ రూ.లక్షా 30 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కొండమల్లేపల్లి, మార్చి 15 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెనన్నమనేనిపల్లి గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- రాజమండ్రి టూ ఢిల్లీకి గంజాయి సరఫరా


పంతంగి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

చౌటుప్పల్ రూరల్, మార్చి 15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి నుంచి ఢిల్లీకి గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గజియాబాద్ జిల్లా అలాపూర్‌కు చెందిన షాహిద్, ఢిల్లీలోని కార్వాల్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్, బీహార్ రాష్ట్రం అంచల్‌బేనిపూర్ జిల్లా హరిపూర్‌కు చెందిన ఎండీ ఇస్లాం, ఢిల్లీలోని బాజన్‌పురకు చెందిన సచిన్‌కుమార్, ఢిల్లీలోని జయాద్‌పూర్‌కు చెందిన మహ్మద్ జాహిద్, ఛత్తీస్‌ఘడ్‌లోని కోట రాయపూర్‌కు చెందిన రఘువీర్ రాయ్, ఢిల్లీలోని ఖజూరీకి చెందిన ముఖేష్‌తోపాటు ఢిల్లీకి చెందిన ఓ బాలుడు (మైనర్) ముఠాగా ఏర్పడి గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ఇందులో షాహిద్ ఆటో డ్రైవర్‌గా, ఇమ్రాన్ కూలీగా, అస్లాం కూలీగా, సచిన్‌కుమార్ పెయింటర్‌గా, బాలుడు కూలీ పని, జాహిద్ పండ్లవ్యాపారం చేసుకుంటూ గంజాయికి బానిసలుగా మారారు. దీంతో అక్కడ గంజాయి వ్యాపారం నిర్వహించే ముఖేష్‌తో పరిచయం ఏర్పడి గంజాయి సరఫరాకు ఒప్పందం కుదుర్చుకున్నారు. తాను చెప్పిన ప్రకారం గంజాయిని తీసుకొస్తే పెద్ద మొత్తంలో డబ్బులిస్తానని ముఖేష్ చెప్పాడు. ముఖేష్ సూచనల మేరకు షాహిద్, ఇమ్రాన్, అస్లాం, సచిన్‌కుమార్, జాహిద్, బాలుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాలో గంజాయి వ్యాపారం చేసే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కోట రాయపూర్‌కు చెందిన రఘువీర్‌రాయ్ వద్ద గంజాయి తెచ్చేందుకు ఈ నెల 11న బయలుదేరారు. ఈ నెల 13న నిందితులు రాజమండ్రిలో గంజాయి సరఫరాదారుడు రఘువీర్‌రాయ్ నుంచి గంజాయిని తీసుకున్నారు. రాజమండ్రి నుంచి ఎన్ఎల్ 0బీ 3112 ప్రైవేటు బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రైలులో వెళ్లాల్సి ఉంది. విశ్వసనీయ సమాచారం మేరకు రాచకొండ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు ఈ నెల 14న చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద మాటువేసి బస్సును నిలిపి తనిఖీలు చేశారు. బస్సు లగేజీ బాక్స్‌లోని ఆరు బ్యాగులను తెరిచి చూడగా, అందులో 84కిలోల గంజాయిని ప్యాకెట్లుగా చేసి ఉంచడాన్ని గుర్తించారు. నిందితులు షాహిద్, ఇమ్రాన్, అస్లాం, సచిన్‌కుమార్, జాహిద్‌ను గురువారం అరెస్ట్‌చేయగా, బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పరారీలో ఉన్న సరఫరాదారుడు రఘువీర్‌రాయ్‌ను శుక్రవారం పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.21లక్షలు ఉంటుందని, గంజాయితోపాటు రూ.10 వేలు, 4 సెల్‌ఫోన్లు, రఘువీర్‌రాయ్ ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. షాహిద్, ఇమ్రాన్, అస్లాం, సచిన్‌కుమార్, జాహిద్, రఘువీర్‌రాయ్‌ను చౌటుప్పల్ కోర్టులో హాజరుపరిచారు. ఢిల్లీ గంజాయి వ్యాపారి ముఖేష్ పరారీలో ఉన్నట్లు వివరించారు. పలుస్టేషన్లలో వీరిపై గంజాయి రవాణా కేసులు ఉన్నాయని, వాటిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


జనార్దన్(ఫైల్)

తుంగతుర్తి, మార్చి 15 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని బండరామారం ఎక్స్‌రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన గుమ్మడవల్లి జనార్ధన్(77) భార్య చంద్రకళ మోపెడ్‌పై తుంగతుర్తి మండల కేంద్రానికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. బండరామారం ఎక్స్‌రోడ్డు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో జనార్ధన్, చంద్రకళకు తీవ్రగాయాలయ్యాయి. వారిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించగా జనార్ధన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మెరుగైన చికిత్స కోసం చంద్రకళను హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. జనార్ధన్‌కు ముగ్గురు కుమారులు కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో..

మునగాల, మార్చి 15 : సూర్యాపేట జిల్లా మునుగాల మండలంలోని ముకుందాపురం గ్రామ సమీపంలో బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి(48) పని నిమిత్తం అత్తాగారి ఊరు ముకుందాపురం వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముకుందాపురం సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టటంతో శ్రీనివాసరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందారు. భార్య సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తా

గుండాల, మార్చి 15 : యాదాద్రిభువనగిరి గుండాల మండల కేంద్రంలో గుండాల- పాచిల్లా మధ్య కారు అదుపు తప్పి బోల్తా పడి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన మచ్చ కృష్ణారెడ్డి మోత్కూరు నుంచి సీతారాంపురం గ్రామానికి వస్తుండగా గుండాల - పాచిల్లా మధ్య కారు అదుపు తప్పడంతో పల్టీ కొట్టుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగిపడింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారులో ఉన్న కృష్ణారెడ్డి క్షేమంగా బయటపడ్డాడు.

భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలి : శ్రీకాంతాచారి తల్లి


గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న శంకరమ్మ

మంగళ్‌హాట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ పదవులు ఇచ్చిందని శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ ఆరోపించింది. శుక్రవారం నాంపల్లిలోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనకు టికెట్ ఇచ్చి గెలిపించాలన్నారు. ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని, అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించకుండా మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు ఇచ్చిన అమరుల కుటుంబాలకు 10 ఏళ్లుగా న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బిడ్డతో పాటు 1000 మంది బిడ్డలు అమరులయ్యారని గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు చట్టసభల్లో గాని, కనీసం నామినేటెడ్ పదవులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేయని వారు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలయ్యారని, ఇప్పటికైనా అన్ని పార్టీలు అమరుల కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమనాయకులు, అమరుల కుటుంబాలు పాల్గొన్నాయి.



మురళీకృష్ణుడిని ఊరేగిస్తున్న అర్చకులు, అధికారులు



పదోతరగతి విద్యార్థులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకుడు

గోవర్ధనగిరిధారిగా నారసింహుడు



గోవర్ధనగిరిని గోటిపై నిలిపిన గోవర్ధనగిరిధారిగా యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడు శుక్రవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. విశ్వశాంతి...లోకకల్యాణం కోసం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని గోవర్ధన గిరిధారిగా శ్రీకృష్ణుడి అలంకారంలో ముస్తాబు చేసి ఆగమశాస్త్రరీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింహ వాహనంపై స్వామిని తిరువీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధార్మిక, సంగీత, సాంస్కృతిక మహాసభలు భక్తులను అలరించాయి.



దేవదేవుడికి అంజలి ఘటిస్తున్న యువతులు





అలరిస్తున్న నృత్య ప్రదర్శనలు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఆలేరు రూరల్/ బొమ్మలరామారం/ తుర్కపల్లి, మార్చి 15: అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని శారాజీపేట, టంగుటూరు, మందనపల్లి, కొలనుపాక, పటేల్‌గూడెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో సలీం, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీ గంధమల్ల అశోక్, వైస్‌ఎంపీపీ గాజుల లావణ్య, ఎంపీటీసీలు బత్తుల నరేందర్‌రెడ్డి, బైరపాక లక్ష్మీ, నాయకులు వెంకటేశ్వర్‌రాజు, కుమార్, సురేష్, పర్వతాలు, కృష్ణమూర్తి, రమేష్, అజయ్ ఉన్నారు. ఇదిలా ఉండగా వంద రోజుల్లోనే ఆలేరు అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులను తీసుకువచ్చానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని మందనపల్లిలో విలేఖరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రోజుకు ఒక రూ.కోటి నిధులు తెచ్చి వెనుకబడిన ఆలేరు ప్రాంతన్ని అంచెలంచెలుగా చేయడమే తన లక్ష్యమన్నారు. ఆలేరు నియోజకవర్గానికి మరో వెయ్యి ఇళ్లు మంజూరు చేయాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు.

● బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామం నుంచి వడపర్తి వరకు రూ.18కోట్ల రూపాయలతో మంజూరైన డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అయిలయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మండల అధికారులతో సమావేశమై ప్రభుత్వ హామీల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎంపీపీ సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో, ఎంపీఓ ఎంపీటీసీ గొడుగు శోభ, చంద్రమౌళి, ఎంపీటీసీ శ్రీహరినాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిర్తి మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు నాయక్, రాష్ట్ర ఆదివాసి సెక్రటరీ మూడావత్ రాజునాయక్, దేశెట్టి చంద్రశేఖర్, శ్రవణ్ ప్రసాద్‌రెడ్డి, బొర్ర కృష్ణ, జూపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భగవంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తాజామాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, రాంపల్లి మహేష్‌గౌడ్, బేతాళ శ్రీనివాస్, జూపల్లి చంద్రమౌళి, మహేష్ పాల్గొన్నారు.



బొమ్మలరామారం: డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ: భువనగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తనవంతు కృషి చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని సంగెం, గోకారం, వలిగొండ పట్టణం, పులిగిల్ల, మొగిలిపాక, వెల్వర్తి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, జడ్పీటీసీ వాకిటి పద్మ, వైస్‌ఎంపీపీ బాతరాజు ఉమా, ఎంపీటీసీలు కుందారపు యశోద, పల్లెర్ల భాగ్యమ్మ, సునీత పాల్గొన్నారు. వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సంతృప్తిని ఇచ్చిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో 5 గ్యారంటీలు అమలు చేశామని తెలిపారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు/ అడ్డగూడూరు : బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని పాలడుగు, దత్తప్పగూడెం, సదర్శాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసి మాట్లాడారు. ప్రాధాన్య క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పాలడుగులో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు, దత్తప్పగూడంలో రూ.22 లక్షల వ్యయంతో ఉన్నత పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి, సదర్శాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. దత్తప్పగూడెంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మ యాదయ్య, పాలడుగు మాజీ సర్పంచ్‌లు మర్రిపెల్లి యాదయ్య, అంతటి నర్సయ్య, వెంకటయ్య, పల్లెర్ల భాస్కర్, తీగల నర్సింహారెడ్డి, రాచకొండ బాలరాజు, గొట్టె వెంకన్న, దొండ శ్రీశైలం, తీగల వినోద్, నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి, లింగయ్య, శ్రీను పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలోని ధర్మారంలో రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే సామేల్ శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో బిక్కేరు వాగు చెక్ డ్యాంమ్ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వర్కింగ్ ప్రేసిడెంట్ రాచకొండ రమేష్, వళ్లంభట్ల రవీందర్, లాదినేని నాగయ్య, పాశం సత్యనారాయణ, బొమ్మగాని లక్షమ్మయ్య, కన్నెబోయిన గంగారాజు, దాసరి భిక్షం ఉన్నారు.



వలిగొండలో సీసీ రోడ్డు పనులు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



దత్తప్పగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

కనుముకులలో వైభవంగా ధ్వజారోహణం



బసవలింగేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 15 : మండల పరిధిలోని కనుముకుల గ్రామానికి చెందిన ప్రసిద్ధ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ నిర్మాణకర్తలు, జడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి అన్నారు. వేంకటేశ్వరస్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ ఛాయాధివాసం, హవనం, ధ్వజారోహణం, మహానివేదన, భేరి పూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామివారి తిరుకల్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో కోట సత్తిరెడ్డి-అమృత, కోట అభిలాష్‌రెడ్డి - శ్రీజ పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గంగా, పార్వతీ సమేత బసవలింగేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో వైభవంగా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, దేవాలయం అధ్యక్షుడు ఏనుగు మహిపాల్‌రెడ్డి, ధర్మకర్తలు వనం లక్ష్మణ్, కర్నాటి పురుషోత్తం, సిద్దగోని మహేష్‌గౌడ్, మద్ది మధుసూదన్‌రెడ్డి, నోముల యాదిరెడ్డి, మైసగోని మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కోతుల పట్టివేతకు ఏర్పాట్లు

తుర్కపల్లి, మార్చి 15: తుర్కపల్లి గ్రామస్థుల కోరిక మేరకు మండల కేంద్రానికి చెందిన సీఎం సీపీఆర్‌వో బోరెడ్డి అయోధ్యరెడ్డి కోతుల పట్టివేతకు సహకారం అందించారు. కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల పట్టివేత విషయంపై అయోధ్యరెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి కోతులు పట్టివేతకు అగు ఖర్చును తానే భరిస్తానని చెప్పి, కోతులు పట్టే సిబ్బందిని గ్రామానికి పంపించారు. గ్రామంలో కోతుల పట్టడానికి బోనును ఏర్పాటు చేశారు.

తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దే



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

తుర్కపల్లి, మార్చి 15: గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారం పంచాయతీ పరిధిలోని ధర్మారం, కేశ్యాతండ, జామ్లతండ గ్రామాల్లో జడ్పీ నిధుల ద్వారా మంజూరైన సుమారు రూ.12.50లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీవస్ చైర్మన్ ధానావతు బీకునాయక్, ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, తాజా మాజీ సర్పంచ్ మంగిత్యానాయక్, పీఆర్ఏఈ తులసికృష్ణ పాల్గొన్నారు.

' మత సామరస్యాన్ని కాపాడుకుందాం'

ఆలేరు రూరల్, మార్చి 15: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువకులపైనే ఉందదని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడికుమార్ అన్నారు. శుక్రవారం ఆలేరులోని ప్రభుత్వ ఐటీఐలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోని ప్రధాన సమస్యలను ప్రజలు ప్రశ్నించ వద్దనే మతోన్మాదాన్ని పోషిస్తూ దేశంలోని బీజేపీ ప్రభుత్వం అలజడులను సృష్టిస్తోందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం నవ్వుతూ ఉరి కంబం ఎక్కిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఇక్కిరి కుమార్, ఉదయ్, ప్రసాద్, లక్ష్మణ్, రాఘవేంద్ర, యశ్వంత్ ఉన్నారు.

గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ టౌన్, మార్చి 15: ప్రభుత్వం సరఫరా చేసిన గడ్డి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తంగడపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ జి. సత్యనారాయణ కోరారు. మదర్ డైరీ ద్వారా సనఫరా చేసిన గడ్డి విత్తనాలను శుక్రవారం చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పరిదిలోని 55 మంది రైతులకు ఆరు కిలోల వంతున చైర్మన్ సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు జి.గాలయ్య, అరిగే బీరప్ప, ఏళ్ల ప్రభాకర్‌రెడ్డి, బలికే దాసు, నాగమణి, ప్రమీల, ఎల్లప్ప, శ్రీను, సంఘం సెక్రటరీ ముష్కు మాధవరెడ్డి పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళులు



భువనగిరిలో అంబేడ్కర్, కాన్షీరాం చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: అణగారిన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడిన కాన్షిరాం జయంతిని పురస్కరించుకుని శుక్రవారం భువనగిరిలో ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డి.ఎస్.పి జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్, బాలయ్య, అశోక్ యాదవ్, శాంతికుమార్, మహేష్ పాల్గొన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ నాయకులు ఎర్ర దానయ్యముష్కు నర్సింహ, తగరం సుభాష్ చంద్రబోస్, కత్తుల పద్మ ఉన్నారు. వలిగొండలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గుండు కృష్ణ, మండల అధ్యక్షుడు సుక్క శ్రీకాంత్, నాయకులు కృష్ణహర్, నరేందర్, ప్రశాంత్, మణికంఠ లింగయ్య తదితరులు పాల్గొన్నారు. ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాకేష్, నరేష్, నవీన్, వెంకటేశ్, భాను, పవన్, సాయి, తేజ, మురళి పాల్గొన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యఓఉడు నల్ల చంద్రస్వామి మాదిగ, బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. అడ్డగూడూరులో మందుల చంటి, గూడేళి నరేష్, మందుల శ్రీకాంత్, మందుల శేఖరు, మందుత సుజాత, గూడెల్లి సురేష్ ఉన్నారు. రామన్నపేటలో బీఎస్పీ నాయకులు పావిరాల నరసింహయాదవ్, మేడి సంతోష్, మండల మహిళా కన్వీనర్ బండెల అనిత, నకిరేకంటి పాల్గొన్నారు.

భువనగిరి బరిలో సీపీఎం : వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత వీరయ్య

భువనగిరి టౌన్, మార్చి 15: సార్వత్రిక ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మతాలు, కులాలు పేరిట దేశంలో చిచ్చు పెడుతున్న బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల పాలనలో బీజేపీ చేసిన విధ్వంసానికి ఈ ఎన్నికలతో ప్రజలు చరమగీతం పాడాలన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎంను పార్లమెంటుకు పంపాలని కోరారు. త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, నాయకులు మంగ నరసింహులు, మాటూరి బాలరాజ్, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు పాల్గొన్నారు.

'యూనిటీ' డాక్యుమెంటరీకి రెండు అవార్డులు

చౌటుప్పల్ టౌన్, మార్చి 15: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన యూనిటీ డాక్యుమెంటరీ ఫిల్మ్‌కు రెండు అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ముంబాయిలో ఇటీవల నిర్వహించిన భారత్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్- 2023- 24లో యూనిట్ డాక్యుమెంటరీ రెండు అవార్డులను సొంతం చేసుకుంది. అర గంట పాటు సాగే ఈ డాక్యుమెంటరి ఫిల్మ్‌కు బెస్ట్ హిస్టారికల్ డాక్యుమెంట్ ఫిల్మ్, ఐకానిక్ ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డులను గెలుచుకుంది. కాగా, చౌటుప్పల్ పట్టణానికి చెందిన చిరందాస్ ధనుంజయ్య ఈ డాక్యుమెంటరీని రూపొందించగా, బడుగు విజయ్‌కుమార్ దర్శకత్వం వహించారు.

రశీదులను అడిగి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మారుతీదేవి

భువనగిరి టౌన్, మార్చి 15: కొనుగోలు చేసిన వస్తువుల రశీదులను అడిగి తీసుకోవాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.మారుతీదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వినియోగదారుల సమన్వయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. రశీదులు లేకపోవడంతో కొనుగోలు చేసిన వస్తువుతో జరుగుతున్న నష్టాలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయలేకపోతున్నారన్నారు. రశీదులు ఉంటే వినియోగదారుల ఫోరం లేదా న్యాయస్థానాలకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగారం అంజయ్య, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

● కోర్టులపై కేసుల భారం తగ్గింపు, రాజీపడదగిన కేసుల పరిష్కారమే లక్ష్యంగా శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కర్యాదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్యా ఓ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికం

● *బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు*



మోత్కూరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు/ అడ్డగూడూరు, మార్చి 15: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేంద్రప్రభుత్వం ఈడీతో కవితను అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు. కవితను బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ అధ్యక్షుడు కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, మాజీ ఎంపీటీసీలు జంగ శ్రీనివాస్, పానుగుళ్ల విష్ణుమూర్తి, నాయకులు కొండ సోంమల్లు, చౌగోని సత్యం, మర్రి అనిల్‌కుమార్, పరమేష్, నాగరాజు పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో బీఆడిస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగులపల్లి దేవగిరి, గూడేపు నరేష్, గూడేపు పరమేష్, చెరుకు మధు, వెంకన్న ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఆలేరు రూరల్: కన్నవారి కలలను సాకారం చేయడమే విద్యార్థుల ముందున్న లక్ష్యమని రామకృష్ణ విద్యాలయ ప్రిన్సిపాల్ బండి రాజుల శంకర్ అన్నారు. పాఠశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. రమేష్, సిద్దులు, దినేష్, జయమ ఉన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని బొల్లెపల్లిలో శుక్రవారం ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో ఓటు హక్కు వినియోగంపై అవగహన కల్పించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి లోకేష్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, మేట్ కల్పన, ఉపాధి కూలీలు ఉన్నారు.

మోత్కూరు : గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరిన సీపీఐ మండల నాయకులు జంగ నర్సయ్య, నిలిగొండ అశోక్ స్థానిక కేఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి సమక్షంలో తిరిగి సీపీఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● మోత్కూరు మునిసిపల్ నూతన చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డిని శుక్రవారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, మండల, పట్టణ కార్యదర్శులు అన్నెపు వెంకట్, పుల్కరం మల్లేష్ ఘనంగా సన్మానించారు. నాయకులు నిలిగొండ అశోక్, కడమంచి వీరస్వామి, టి.లక్ష్మీనర్సయ్య, కన్నయ్య, అంజయ్య, యాదగిరి పాల్గొన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డిని కాంగ్రెస్ దాచారం నాయకులు ఘనంగా సన్మానించారు.

మోత్కూరు/యాదగిరిగుట్ట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని దత్తప్పగూడెంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మయాదయ్య, చింత చంద్రయ్య, వల్లందాసు వెంకన్న, ముక్కెర్ల మల్లేష్, తొంట భాస్కర్, చంద్రయ్య, రాములు పాల్గొన్నారు. యాదగిరిగుట్టలో సింహద్వారం ఎదుట కరుమ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం నాకులు రేగు బాలనర్సయ్య, గవ్వల నర్సింహులు, కాదూరి అచ్చయ్య, గుండా భాస్కర్, కల్లెపల్లి శ్రీశైలం, నంద వెంకటేష్, జెట్ట సాగర్, జోగు శంకర్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : మోటకొండూర్ మండల కేంద్రానికి పూర్తి స్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పీసరి తిరుమల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో ఎంపీడీవో ఇందిరకు వినతి పత్రాన్ని అందజేశారు.

మోటకొండూర్ : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గిరబోయినగూడెం గ్రామానికి చెందిన గిరబోయిన మల్కయ్యను కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.

యాదగిరిగుట్ట రూరల్: గుట్ట మునిసిపల్ పరిధిలోని 9వ వార్డు ఆవరణలోని సాయిబాబాగుడి ప్రాంతంలో సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్ డి.అనిల్ శంకుస్థాపన చేశారు.

గుండాల: మండల కేంద్రంలో శుక్రవారం 60 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.సుశీల, పశువైదాధికారులు డాక్టర్ ప్రత్యూష, యాకూబ్, ప్రవీణ్, గోపాల మిత్రలు కృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆడెపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ నియమక పత్రాన్ని అందజేశారు.

చౌటుప్పల్ టౌన్ : మునిసిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టినట్టు మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. మునిసిపాలిటీలోని 11, 19 వ వార్డులలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు చైర్మన్ రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య 9
స్మార్ట్
శనివారం • 16 మార్చి 2024

స్పోటిఫై నుంచి మ్యూజిక్ వీడియోలు





స్పోటిఫై మ్యూజిక్ వీడియోలను అధికారికంగా సపోర్ట్ చేస్తోంది. ఇప్పటికిది బేటా ఫీచర్‌గా స్పోటిఫై పేర్కొంది. ప్రస్తుతానికి 11 దేశాల్లో మాత్రమే లభ్యమవుతుంది. ఇందులో ఇండియా లేదు. ఈడీ షీరన్, ఐస్ స్పైస్, అలూనా, అసోకే కు ప్రస్తుతానికి మద్దతు ఇస్తోంది. రాబోయే రోజుల్లో వేలకొద్దీ పాటలను కలుపుకోనుంది. ఈ సదుపాయం లభించాలంటే సాంగ్ టైటిల్‌పై 'స్విచ్ టు వీడియో ఐకాన్' కనిపించాలి. దాన్ని టాపింగ్ చేస్తే సాంగ్ రీస్టార్ట్ అవుతుంది. మ్యూజిక్ వీడియో ఫుల్‌స్క్రీన్ కోసం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లపై రొటేట్ చేయవచ్చు. మళ్లీ మామూలుగా కావడానికి కూడా స్విచ్ టు ఆడియో పైనే టాప్ చేయాలి. డెస్క్‌టాప్, టీవీ డివైజుల్లోనూ అందుబాటులో ఉంటుంది. అయితే డివైజ్ ఏదైనా సరే, ప్రీమియమ్ చందాదారులకు మాత్రమే వీక్షించగలరు.

వాట్సాప్‌లో చాట్ ఫిల్టర్స్

వాట్సాప్ - చాట్ ఫిల్టర్స్‌పై పనిచేస్తోందని సమాచారం. దీనిపై గత ఏడాది వేసవి తిరిగి సెప్టెంబర్‌లో పని చేసినప్పటికీ పురోగతి లేదు. ప్రస్తుతం మళ్లీ దీనిపై వాట్సాప్ దృష్టిసారించిందని 'డబ్ల్యుబేటాఇన్ఫో' తెలిపింది.



బేటా టెస్టర్లకు ప్రస్తుతం దీన్ని విడుదల చేస్తున్నట్టు కూడా పేర్కొంది. అలాగే ఆ నివేదికలో బైటపెట్టిన స్క్రీన్‌షాట్ ప్రకారం వాట్సాప్‌లో కాన్వర్సేషన్ లిస్టులో టాప్‌లో చాట్ ఫిల్టర్స్ ఉన్నాయి. చదవని సంభాషణల కోసం ఒకటి, గ్రూప్ చాట్స్ లిస్టింగ్స్ కోసం మరొకటి చాట్ ఫిల్టర్లు ఉండనున్నాయి. ఇంతకుమునుపు పర్సనల్, బిజినెస్ చాట్స్ కోసం ఫిల్టర్లను పెట్టి ఒక ప్రయోగం చేసింది. ప్రస్తుతం వాటిని పక్కన పెట్టేసింది. సంభాషణల నిర్వహణ, చాంతాడు జాబితా నుంచి ప్రత్యేకించిన చాట్స్‌ను కనుగొనడం వంటి పనులకు ఈ ఫిల్టర్లు ఉపయోగపడతాయి. మేనేజింగ్ కమ్యూనికేషన్స్ విషయానికి వస్తే వాట్సాప్ ప్రత్యేకంగా చాట్స్ పిన్ చేయడం, ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ కాన్వర్సేషన్స్ ఇండికేట్ చేయడానికి మరొకటి ఫీచర్లపై కూడా వాట్సాప్ పనిచేస్తోంది.

స్లాక్ నుంచి జీఐఎఫ్ ఫైండర్



వ్యాపారాలు, టీమ్స్ కోసం ఉద్దేశించి కమ్యూనికేషన్ టూల్స్‌గా స్లాక్ ప్రసిద్ధి. టీమ్ పరిధిలో ఈమెయిల్, ఫోన్ కాల్స్‌కు స్వస్తిపలికేలా చేసింది. ఇప్పుడు ఇదే కమ్యూనికేషన్ టూల్ తాజాగా జీఐఎఫ్ ఫీచర్‌ను కలిపింది. టీమ్ సభ్యుల మధ్య ఫన్ కోసం దీన్ని క్రియేట్ చేసింది. రోజువారీ మెసేజింగ్‌లో జీఐఎఫ్‌కు ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. జీఐఎఫ్‌ని ఇంటిగ్రేట్ చేసినట్టు స్లాక్ ప్రత్యేకించి ఎక్స్‌లో పోస్టు చేసింది. దీంతో పర్ఫెక్ట్ జీఐఎఫ్‌ను యూజర్లు సెలెక్ట్ చేసుకోగలుగుతారు. కొత్త ఫీచర్ కాస్తా ఇప్పుడు గూగుల్‌కు చెందిన జీఐఎఫ్ సెర్చ్ ఇంజిన్‌గా మారింది. ఈ ఫీచర్ సహాయంతో వేలాది జీఐఎఫ్‌లు యూజర్లకు అందుబాటులోకి వచ్చాయి. స్లాక్‌పై జీఐఎఫ్‌ల కోసం అవసరమైన చాట్‌ను ఓపెన్ చేయాలి. తదుపరి ఎమోజీ ఐకాన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ జీఐఎఫ్ ట్యాబ్ కనిపిస్తుంది. పాపప్ అయిన వాటి నుంచి ఎంచుకుని జతచేసుకోవాలి. అపై షేర్ చేసుకోవాలి.

వచ్చే నెలలో మైక్రోసాఫ్ట్ కోపైలెట్ సెక్యూరిటీ



మైక్రోసాఫ్ట్ కోపైలెట్ సెక్యూరిటీ మొత్తానికి వచ్చే నెలలో విడుదల కానుంది. ఈ విషయాన్ని మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్ పోస్టులో వెల్లడించింది. ఏఐ సైబర్ సెక్యూరిటీ సెంట్రిక్ చాట్‌బోట్ ఇది. గత ఏడాది మార్చిలోనే దీనిని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. సరిగ్గా ఏడాది తరవాత వాస్తవరూపం ధరిస్తోంది. భద్రతకు సంబంధించి సందేహాల నివృత్తికి తోడు బెదిరింపులపై దర్యాప్తు, విశ్లేషణలను కూడా ఇది చేపడుతుంది. పాతిక వరకు భాషలను సపోర్ట్ చేస్తుంది. థ్రెట్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి డేటా పెద్ద ఎత్తున దీని వద్ద పోగుపడి ఉంది. 78 ట్రిలియన్ల మేర సెక్యూరిటీ సిగ్నల్స్‌ను ప్రతి రోజూ ప్రాసెస్ చేస్తోంది. దీనికి తోడు లాంగ్వేజ్ మోడల్స్‌ను కూడా అవసరానికి తగ్గట్టు రూపొందించగలుగుతోంది. ఈ చాట్‌బోట్ రెండు వెర్షన్స్‌లో లభ్యమవుతుంది. అందులో మొదటిది వివిధ సంస్థల్లో అమలులో ఉన్న సెక్యూరిటీ సిస్టమ్‌కు అనుగుణ్యమైనది. మరొకటి అక్కడి వ్యక్తులకు సహాయపడేది కాగా ఈ సర్వీసును గంటకు నాలుగు డాలర్లు చొప్పున నెలవారి బిల్లింగ్‌కు మాట్లాడుకోవాల్సి ఉంటుంది.

ఆండ్రాయిడ్ యూజర్లకు కాల్ టు వీడియో ఫీచర్



ఆండ్రాయిడ్ యూజర్లు ఇకపై రెగ్యులర్ వాయిస్ కాల్స్‌ను వీడియో కాల్స్‌గా మార్చుకునే సౌలభ్యాన్ని పొందనున్నారు. ప్రస్తుతం ఇదే పనిపై గూగుల్ ఉందని, సదరు ఫీచర్ టెస్టింగ్‌లో ఉందని తెలిసింది. ఇందుకోసం ప్రత్యేకించి బటన్ సహాయంతో పెద్దగా ఇబ్బంది పడకుండానే వాయిస్ నుంచి వీడియో కాల్‌కు మారవచ్చు. ఐఫోన్‌లో ఫేస్‌టైమ్ అనుభవం మాదిరిగా ఉంటుంది. అండ్రాయిడ్ 14పై రన్ అవుతున్న కొన్ని పిక్సెల్ ఫోన్లకు ఈ ఫీచర్‌ను మొదట అందుబాటులోకి తేనున్నారు. తదుపరి క్రమక్రమంగా దీన్ని విస్తరించనున్నారు. ఈ ఫీచర్‌తోనే ఆండ్రాయిడ్ యూజర్లు ఏకంగా ఐఫోన్ యూజర్లతో వీడియోకాల్స్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే గూగుల్ మీట్ యాప్ ఆండ్రాయిడ్ డివైజ్‌లో ఉండాలి. నేటివ్ యాప్ పరిధిలో మీట్ యాప్‌తో ఇంటిగ్రేట్ అయి సులువుగా పని అవుతుంది. మీట్ యాప్ లేకుంటే దానిని డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రాంప్ట్ అందుతుంది. ఐఫోన్ మాదిరిగా కాకుండా ఆండ్రాయిడ్ డివైజుల్లో ఫ్లెక్సిబిలిటీ ఉంటుంది. మూడో పార్టీ యాప్‌లను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

గమ్మా యాప్ : ఏఐ టూల్స్

గమ్మా యాప్ - ప్రజంటేషన్స్ నుంచి వెబ్ పేజీల క్రియేషన్ వరకు రూపకల్పనకుగాను ఏఐ టూల్స్‌ను జతచేసింది. ముఖ్యంగా పనిచేసే చోట ప్రజంటేషన్స్, డాక్యుమెంట్స్ రూపకల్పన సర్వసాధారణం. వీటి కోసం ఉద్యోగులు చాలా పెద్ద ఎత్తున శ్రమపడాల్సి ఉంటుంది కూడా. అయితే గమ్మా యాప్ తాజాగా కలిపిన ఏఐ టూల్స్ సహకారంతో చాలా వేగంగా ఈ పనులను చక్కబెట్టవచ్చు. ఈ టూల్స్ సహాయంతో డాక్యుమెంట్స్ తదితరాల రూపకల్పన చిటికెలో పూర్తవుతుంది. పేరు సూచిస్తే చాలు, పనిని సదరు టూల్స్ పూర్తి చేస్తాయి.



కంటెంట్ రైటింగ్‌తో మొదలుపెట్టి రిఫైనింగ్ వరకు పనులన్నీ చకచకా జరుగుతాయి. ఇందుకోసం...


- గమ్మాకు చెందిన ఏఐ జనరేటర్ - లేఔట్స్ డిజైన్, డిజైన్స్, యూజర్ ప్రాంప్టర్, డాక్యుమెంట్స్, వెబ్ పేజీల తయారీలో సహాయపడుతుంది.
- ఫార్మేటింగ్, స్టయిలింగ్, పొజిషనింగ్ తదితర విషయాల్లో యూజర్ ఆందోళన చెందాల్సిన పని ఉండదు. సింగిల్ క్లిక్‌తో ప్రొఫెషనల్ లుక్‌తో ప్రజంటేషన్‌ను రూపొందిస్తుంది.
- లైవ్ ప్రజంట్ మోడ్‌లో గమ్మా వస్తుంది. యూజర్లు ఈ ప్రజంటేషన్లను షేర్ చేసుకోవచ్చు.
- టెక్స్ట్ సమ్మరైజింగ్, రీరైటింగ్, ఎస్‌ఈఓ, ఏఐ ఇమేజ్ సెర్చ్ సహా పలు పనులను గమ్మా నిర్వర్తిస్తుంది.
- జీఐఎఫ్‌లు, వీడియోలు, వెబ్‌సైట్స్, చార్టులు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

ఉచితంగా కొన్నిఫీచర్లు మాత్రమే యూజర్లకు అందుబాటులో ఉంటాయి. నెలకు పది డాలర్లు చెల్లిస్తే ఈ యాప్‌నకు చెందిన అడ్వాన్స్‌డ్ ఫీచర్లను ఉపయోగించుకోవచ్చు.



గూగుల్ మెసేజెస్‌కు ఆర్‌సీఎస్ కస్టమైజేషన్


గూగుల్ మెసేజెస్ - కొత్త రంగులు, థీమ్స్‌తో ఆర్‌సీఎస్ కస్టమైజేషన్‌ను తీసుకువచ్చింది. రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్‌గా దీన్ని పలువురు ఉపయోగిస్తుండటం తెలిసిందే. ప్రస్తుత ఫీచర్ జోడింపుతో యూజర్లకు ఇక పర్సనలైజేషన్‌కు అవకాశం ఉంటుంది. ఈ అనుభవం ఆండ్రాయిడ్‌లో లభిస్తుంది. గత నవంబర్ నుంచి దీనిపై పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇది బేటా టెస్టర్లకు అందుబాటులోకి వస్తోంది. '9టు5గూగుల్' ప్రకారం



యూజర్లు తమ ఆర్‌సీఎస్ చాట్‌లో కస్టమ్ బబుల్స్ రంగులో నేపథ్యం పొందవచ్చు. చేంజ్ కలర్స్ ఆప్షన్స్ ఉంటుంది. చాట్ ఇంటర్‌ఫేస్‌కు థీమ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. బ్లూ, గ్రీన్ సహా తొమ్మిది థీమ్ ఆప్షన్స్ ఉన్నాయి. ఈ మార్పుతో ఆర్‌సీఎస్ చాట్ యావత్తు కొత్తగా కనిపిస్తుంది. దీని కోసం మూడుచుక్కలపై టాప్ చేయాలి. చేంజ్ కలర్స్ దగ్గరకు వెళ్లి తొమ్మిది డిఫరెంట్ కలర్ ఆప్షన్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇలా ఒకసారి ఆర్‌సీఎస్ చాట్ రంగు మార్చుకుంటే, ఆ మార్పు చాట్ ఇంటర్‌ఫేస్‌లోనూ కనిపిస్తుంది. 'యూ చేంజ్డ్ ద థీమ్' అని మెసేజ్ వస్తుంది.

థీమ్‌ను వేరే రంగులోకి మార్చాలని అనుకుంటే ఇంటర్‌ఫేస్ ఒక లింక్‌ను కూడా చూపుతుంది. అలా ఈ ఫీచర్ ప్రస్తుతానికి టెస్టింగ్ దశలో ఉందని సమాచారం.

3డీ వీడియో గేమ్స్‌కు 'సైమా'



గూగుల్ డీప్‌మైండ్ ప్రత్యేకించి 3డీ వీడియో గేమ్స్ కోసం విలక్షణ ఏఐ మోడల్‌ను పరిచయం చేసింది. స్కేలబుల్ ఇన్‌స్ట్రక్టబుల్ మల్టీవరల్డ్ ఏజెంట్(ఎస్‌ఐఎంఏ - సైమా)అని ఈ ఏఐ మోడల్‌ని అంటారు. వేర్వేరు గేమింగ్ వాతావరణాల్లో టాస్కులను నెరవేర్చే పనిని తెలుసుకుంటోంది. ఇంకా పరిశోధన స్థాయిలోనే ఉంది. ఒకసారి ఇది పక్కాగా రూపొందితే ఆన్‌లైన్ నుంచి రియల్ వరల్డ్ వరకు ఉపయోగించుకోవచ్చని గూగుల్ పేర్కొనడం విశేషం. లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్‌ను క్రియేట్ చేసేందుకు ఎయిట్ గేమ్ స్టూడియోతో గూగుల్ డీప్‌మైండ్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. సైమాని తొమ్మిది వేర్వేరు గేమ్స్ కోసం శిక్షణ ఇప్పించింది. హెలోగేమ్స్, టియర్‌డౌన్, గోట్ సిమ్యులేటర్ 3 వంటివి ఈ గేమ్స్‌లో ఉన్నాయి. ఇందులో ప్రతి గేమ్ వేర్వేరు ఆబ్జెక్టులు, మెనూతో ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుంది. అలాగే నాలుగు వేర్వేరు రీసెర్చ్ పరిస్థితులను కూడా కంపెనీ కల్పించింది. తద్వారా కన్‌స్ట్రక్షన్ ల్యాబ్‌ను నిర్మించింది. ఇందులోనే స్కల్పచర్స్ నుంచి అన్నీ రూపొందుతాయి. సైమా ఇప్పటికి 600 వరకు బేసిక్ స్కిల్స్‌ను నేర్చుకుంది. మొత్తమ్మీద మనుషుల ఆదేశాల మేరకు 3డీ వీడియో గేమింగ్‌కు సాధ్యమయ్యేందుకు చురుకుగా వ్యవహారాలు సాగుతున్నాయి.

టెంపరేచర్‌పై పేటెంట్!

యాపిల్ - టెంపరేచర్ మెజర్‌మెంట్‌పై పేటెంట్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. యాపిల్ వాచీలో ప్రధానంగా డివైజ్ అలాగే పరిసరాల్లోని ఉష్ణోగ్రతలో ఉండే హెచ్చుతగ్గులను సమన్వయం చేయడం ఇందులోని ఉద్దేశం. దీనికి పేటెంట్ లభిస్తే మామ్మూలు థర్మామీటర్లకు మూడినట్లేనని నిపుణులు చెబుతున్నారు. ఐఫోన్ ఉత్పత్తిదారులు బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్ ఫీచర్‌ని తమ స్మార్ట్ వాచీల్లో తీసేసిన నేపథ్యంలో ఈ పెటెంట్ చర్చనీయాంశమైంది. యాపిల్ లేటెస్ట్ వాచీల్లో ఇప్పటికే బాడీ టెంపరేచర్ సెన్సర్ ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 7న తాజా పేటెంట్ కోసం యాపిల్ దరఖాస్తు చేసినట్టు తెలిసింది. బాడీ టెంపరేచర్ లెక్కింపులో ఇది నాన్ ఇన్వేజివ్ మెథడ్‌ను ఉపయోగిస్తుంది. ప్రస్తుతం ఉన్న వాచీలు శరీర ఉష్ణోగ్రతలను మాత్రమే తీసుకుంటున్నాయి. నిజానికి హెచ్చుతగ్గులు డివైజ్ అదే విధంగా పరిసరాలను బట్టి ఉంటాయి. పేటెంట్ తీసుకోనున్న విధానంలో డివైజ్‌లోని రెండు లొకేషన్స్‌కు ఉన్న తేడాని కూడా లెక్కిస్తారు. ఇక్కడ హీట్ ఫ్లక్స్ అంటే ఒక యూనిట్ ఏరియాలో - ఒక యూనిట్ టైమ్ లేదా సర్ఫేస్ నుంచి బదిలీ అయ్యే హీట్ అర్థం. మనిషి చర్మంలోని హీట్ ఫ్లక్స్ ఆధారంగా కరెక్షన్ ఫ్యాక్టర్‌ని లెక్కిస్తుంది. ఉపరితల వేడిని లెక్కించేందుకు ఒకటి లేదా అంతకుమించి అల్గోరిథమ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది. సర్ఫేస్ టెంపరేచరని ఉపయోగిస్తామని పేటెంట్‌లో పేర్కొన్నారు. అలాగే పెటెంట్ అయిన వాచీలో మందంగా ఉండే థెర్మోపైల్ ఫిల్మ్ రెండు జంక్షన్లను కలిపి ఉంచుతుంది. మొత్తమ్మీద యావత్తు ప్రక్రియ ఇంకా కాన్సెప్ట్ దశలోనే ఉంది. అన్నీ పూర్తి చేసుకుని ఉనికిలోకి వస్తుందా లేదా అన్నది ప్రశ్నార్థకం. పేటెంట్‌కు దరఖాస్తు చేసినంతమాత్రాన అది ఆమోదం పొంది, మార్కెట్లోకి వస్తుందని చెప్పలేమని కూడా అంటున్నారు.



గూగుల్ పిక్సెల్ 9 సిరీస్‌లో 'అడాప్టివ్ టచ్'

గూగుల్ తన పిక్సెల్ 9 సిరీస్‌లో 'అడాప్టివ్ టచ్' ఫీచర్‌ను విడుదల చేసే పనిలో ఉన్నట్టు 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. ఈ ఫీచర్‌తో ఫోన్ స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా మోడిఫై చేసుకోవచ్చు. దీని కోసం సెట్టింగ్స్‌లోకి వెళ్లి డిస్‌ప్లేని టాప్ చేయాలి. టచ్ సెన్సిటివిటీని ఎంచుకోవాలి. ఇప్పటివరకు పర్యావరణ శక్తుల ప్రభావంతో ఆటోమేటిక్‌గా అడాప్టివ్ టచ్ కలుగుతుందన్న విషయాన్ని గుర్తించలేదు. వన్‌ప్లస్ 12కి చెందిన అక్వా టచ్ మాదిరిగా ఈ ఫీచర్ ఉంటుందని భావిస్తున్నారు. ఫోన్ వేడెక్కినప్పుడు ఈ ఆక్వా టచ్ ఫీచర్ దాని టచ్ సెన్సిటివిటీని అడ్జస్ట్ చేస్తుంది. ఈ ఫీచర్ పిక్సెల్ 9 సిరీస్‌కే పరిమితమా, మిగిలిన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లకు వస్తుందా అన్నది మాత్రం తెలియరాలేదు. మూడు నెలలకు ఒకసారి పిక్సెల్ ఫీచర్ డ్రాప్ అప్‌గ్రేడ్ ఉంటుంది. అయితే కావాలనే పాత పిక్సెల్స్‌ను గూగుల్ విడిచిపెడుతోంది.



SONY

పీఎస్5 సిస్టమ్‌కు సాఫ్ట్‌వేర్ అప్డేట్

సోనీ - ప్లేస్టేషన్(పీఎస్) 5కి అప్డేట్‌తో ఆడియోపరంగా డ్యూయల్‌సెన్స్ కంట్రోలర్‌ను మెరుగుపర్చింది. దాంతో మరికొన్నింటిని కూడా జతచేసింది. కాన్సోల్‌పై టర్న్ అయినప్పుడు యూజర్లకు ఈ అప్డేట్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కనిపిస్తుంది. ఈ అప్డేట్‌తో డ్యూయల్‌సెన్స్‌పై స్పీకర్లు, డ్యూయల్‌సెన్స్ ఎడ్జ్ బిగ్గరగా మారుతాయి. వాయిస్ చాట్ ఆడియో, గేమ్ శబ్దాల్లో స్పష్టత ఉంటుంది. తెరవెనుక శబ్దాలను తొక్కిపెడుతుంది. కంట్రోలర్ ఇండికేటర్లలో బ్రైట్‌నెస్ అడ్జస్ట్‌మెంట్‌కు కూడా వీలుంటుంది. సరిగ్గా అదే ఫీచర్‌ని పవర్ ఇండికేటర్‌కు కూడా వస్తుంది. కన్సోల్‌పై రెండు వెర్టికల్ ఇండికేటర్స్ ఉంటాయి. ఇవి పీఎస్5 పరిస్థితిని తెలియజేస్తాయి. పార్టీస్, షేర్‌స్క్రీన్, ఎమోజీ రియాక్షన్లకు కూడా సరికొత్త ఫీచర్లు రాబోతున్నాయి. ఇప్పుడు వచ్చిన అప్డేట్ 15.1 ఎమోజీ సపోర్ట్, సిస్టమ్ సాఫ్ట్‌వేర్ పర్ఫార్మెన్స్ స్టెబిలిటీని సైతం తీసుకొచ్చింది.



ఎంజేపీఏపీబీసీఆర్‌జేసీ సెట్ నోటిఫికేషన్

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 16 మార్చి 2024

విజయవాడలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్ఈఐఎస్)- బీసీ ఆర్‌జేసీ సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 18 ఇంగ్లీష్ మీడియం కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. బాలురకు, బాలికలకు విడివిడిగా కాలేజీలు ఉన్నాయి. మొత్తం 2600 సీట్లు ఉండగా వీటిలో 1300 సీట్లను బాలికలకు ప్రత్యేకించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఎంచుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులకు ఐఐటీ జేఈఈ/నీట్ పరీక్షలకు సంబంధించి కోచింగ్ సౌకర్యం కల్పిస్తారు. 75 శాతం సీట్లను బీసీ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్నవారికి కేటాయించారు. మిగిలిన 25 శాతం సీట్లను సాంఘిక సంక్షేమ/గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివినవారికి, సంబంధిత హాస్టళ్లలో ఉన్నవారికి, జడ్పీ స్కూళ్లు/ప్రైవేట్ పాఠశాలల్లో చదివినవారికి నిర్దేశించారు.

బాలుర కళాశాలలు-సీట్లు: సింహాచలం(విశాఖపట్నం), మోపిదేవి(కృష్ణా), నిజాంపట్నం(గుంటూరు), కోట(ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు), దొరవారిసత్రం(ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు), లేపాక్షి(అనంతపురం), గుండుమల(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. కోట(ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు), దొరవారిసత్రం(ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు), లేపాక్షి(అనంతపురం), గుండుమల(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంఈసీ 40 సీట్లు ఉన్నాయి. సోడమ్ (చిత్తూరు), బేతంచర్ల (కర్నూలు) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

బాలికల కళాశాలలు-సీట్లు: నెల్లిమర్ల(విజయనగరం), తానాం(విశాఖపట్నం), నందలూరు(వైఎస్సార్ కడప), అరెకల్(కర్నూలు), నెరవాడ(కర్నూలు), గుడిబండ (అనంతపురం), టేకులోడు(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయి. నెల్లిమర్ల(విజయనగరం), తానాం(విశాఖపట్నం), అరెకల్(కర్నూలు), టేకులోడు(అనంతపురం) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంఈసీ 40 సీట్లు ఉన్నాయి. ఆముదాలవలస(శ్రీకాకుళం), డోన్(కర్నూలు) కళాశాలల్లో ఒక్కోదానిలో ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.



ఎంజేపీ ఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్/బయాలజీ నుంచి 50, ఫిజికల్ సైన్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. ఎంఈసీ/సీఈసీ గ్రూప్‌లో చేరేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్ నుంచి 30, సోషల్ స్టడీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. విద్యార్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్ పా యింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పెన్సిల్ ఉపయోగించకూడదు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ఐఐటీ/నీట్ కోచింగ్ సెంటర్లు

- **బాలురకు:** సింహాచలం కోచింగ్ సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు; దొరవారి సత్రంలో ఐఐటీ 60 సీట్లు ఉన్నాయి.
- **బాలికలకు:** నెల్లిమర్ల కోచింగ్ సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు; నందలూరు సెంటర్‌లో ఐఐటీ 60 సీట్లు; టేకులోడు సెంటర్‌లో నీట్ 40 సీట్లు; తానాం సెంటర్‌లో ఐఐటీ 60, నీట్ 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లోపు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఎంజేపీ ఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 13
- **వెబ్‌సైట్:** mjpapbcwreis.apcfss.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 12
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 16న
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 26
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 29
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూన్ 20
- **తరగతులు ప్రారంభం:** జూలై మొదటి వారంలో
- **వెబ్‌సైట్:** acad.uohyd.ac.in

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరోతరగతి ప్రవేశాలు

అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం- ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 164 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశ పరీక్ష అయిదోతరగతి స్థాయిలో ఉంటుంది. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్ష రాయవచ్చు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ విద్యార్థులకు 35 మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలి. ఈ స్కూళ్లలో బోధన ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు.

అర్హత: ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగు, అయిదు తరగతులు చదివి ఉండాలి. జనరల్, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.150; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.75
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 21
- **విద్యార్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 27
- **ఎంపికైన విద్యార్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 29
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్:** ఏప్రిల్ 30
- **తరగతులు ప్రారంభం:** జూన్ 12 నుంచి
- **వెబ్‌సైట్:** https://apms.apcfss.in

లక్ష్మీపత్ యూనివర్సిటీలో డిజైన్ ప్రోగ్రామ్‌లు

జైపూర్‌లోని జేకే లక్ష్మీపత్ యూనివర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్-బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి రెండో రౌండ్ దరఖాస్తులు కోరుతోంది. డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్)

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, ఇంటర్ డిసిప్లినరీ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో పదోతరగతి, ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎం డిజైన్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ప్రొడక్ట్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి ఏడాది పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జేకే డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, విజువల్ సెన్సిబిలిటీస్ అంశాలనుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసి పోర్ట్ ఫోలియో రౌండ్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. సంస్థ నిర్ణయం మేరకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **డిజైన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 4
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, అనంతపురం
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 8
- **పోర్ట్‌ఫోలియో రౌండ్:** ఏప్రిల్ 15
- **అభ్యర్థుల సెలెక్షన్స్:** ఏప్రిల్ 17
- **రిజిస్ట్రేషన్స్:** జూలై 8
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.jklu.edu.in/

JKLU

ఆతిథ్యమే కెరీర్

(బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్)



ఆసక్తి ఉంటే తీసుకోదగ్గ కెరీర్ ఆప్షన్స్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ ఒకటి. అందుకు పునాదిగా అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో మన దేశంలో అందిస్తున్న కోర్సు బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్). ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకున్నా ఈ కోర్సు చేసేందుకు అర్హులే. దీనిని అందిస్తున్న పలు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరేందుకు ఉద్దేశించిన టెస్ట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్. అందుకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.....

హోటల్ మేనేజ్‌మెంట్ చాలాకాలంగా ఉత్తరాది వారి ఎంచుకునే కోర్సుగానే ఉంది. దాదాపుగా దశాబ్ద కాలం నుంచి దక్షిణాదికీ విస్తరిస్తోంది. ఆరంభంలో ఇది రిసెప్షన్ అండ్ బుక్ కీపింగ్ మాత్రమే. వసతి, తిండి, రూమ్ వ్యవహారాలు మాత్రమే చదువులో భాగం. తరవాతి రోజుల్లో పలు విభాగాల అధ్యయనం అవసరమైంది. అందుకు అనుగుణంగానే కోర్సును కూడా ఉన్నతీకరించారు. అందరికీ పరిచయం ఉన్న వ్యవహారం వంట. దీన్నే ఫుడ్ ప్రొడక్షన్‌గా అందిస్తున్నారు. రెండోది ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్‌మెంట్. హోటల్‌లోని రూమ్స్ మొదలుకుని వాటి నిర్వహణ వంటివన్నీ ఇందులోకి వస్తాయి. కస్టమర్ రిలేషన్స్ ప్రధాన అంశం. అలాగే సేల్స్ అండ్ మార్కెటింగ్ కూడా స్టడీ అంశమే. నగరంలో జరగబోయే వివిధ సదస్సులు, సమావేశాలు అలాగే వాటికి రాబోయే అతిథులు, వారిలో రకాలు, వారి అవసరాలు, కావాల్సిన రూమ్‌లు తదితరాలను ఇందులో అధ్యయనం చేస్తారు. ఒక రకంగా ఇది బిజినెస్‌ను పెంచుకునే వ్యవహారం. అప్పుడే హోటల్‌కు వచ్చిన అతిథులను ఆహ్వానించడంతో మొదలుపెట్టి, వారికి రూమ్ చూపించే వరకు ఉండేవన్నీ లాబీ మేనేజ్‌మెంట్‌లో భాగం. కస్టమర్ రిలేషన్స్ మేనేజ్‌మెంట్, బిల్లింగ్, అకౌంటింగ్ కూడా ఉంటాయి. ఇప్పటి హోటల్స్ లేదంటే ఆతిథ్య రంగానికి అవసరమైన విధంగా మూడేళ్ల కోర్సులో టీచింగ్, ప్రాక్టికల్స్ ఉంటాయి. కోర్సు అనంతరం విద్యార్థులు తమకు నచ్చిన ఫీల్డ్‌ను ఎంచుకుంటారు.

ఎవర్ డిమాండ్

ఫైవ్ హోటల్స్ పెరుగుతున్న నేపథ్యంలో ఎప్పుడూ లక్షకు మించి సిబ్బందికి డిమాండ్ ఉంటుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. మన దేశంలోని వివిధ ప్రసిద్ధ హోటళ్లనే తీసుకుంటే, మూడు లక్షల మందికి మించి పని చేస్తున్నారు. ఏటా వారిలో పది శాతం మందికి ప్రమోషన్ సహా ఏదో రకమైన ఎదుగుదల అదే హోటళ్లలో ఉంటుంది. కనీసం తొంభై వేల మంది ఇతర అవకాశాల కారణంగా ఉద్యోగాలు వదిలిపెట్టి వెళుతున్నారు. ఎక్కువ మంది ఐటి రంగంలోకి వెళుతుంటారు. హోటళ్లకు వచ్చే పెద్ద కస్టమర్లు అక్కడి వారి సేవలను గుర్తించి తీసుకెళుతుంటారు.

ఆరంభంలోనే పారిపోతుంటారు...!

ఈ కోర్సులో చేరిన విద్యార్థుల్లో కొంత మంది మొదటి ఏడాది పూర్తయ్యేసరికి తమవల్ల కాదని పారిపోతుంటారు. ముఖ్యంగా నలుగురితో కలవలేని వ్యక్తులు హోటల్ రంగంలో ఇమడలేరు. శాఖాహారులకు ఫ్రంట్ ఆఫీస్ ఓకే కానీ కిచెన్‌లో మాంసాహార వంటకాలు మాత్రం కష్టమే.

ఎంజాయ్ చేయగలగాలి

అందరూ సెలవు తీసుకుని ఎంజాయ్ చేస్తున్నప్పుడు వీరు పనిచేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న, జనవరి 1న, పర్వదినాల్లో అందరూ కుటుంబంతో గడుపుతుంటారు. వీరు మాత్రం హోటల్ సందర్శకుల సేవల్లో మునిగి తేలాల్సి ఉంటుంది. ఆ రోజు వీరికి చాలా బిజీ. కస్టమర్లతో, టూరిస్టుల ఆనందంలోనూ పాలుపంచుకోవడంలోనే సంతృప్తి చెందాలి. చేస్తున్న వృత్తిలోనే ఎంజాయ్ చేయాలి. ఎంత లేదనుకున్నా కాలేజీలో నేర్పేది ఇరవై శాతమే. ఆ ట్రైనింగ్‌తో ఈ రంగంలో ట్రైనీగా మంచి సంస్థలో చేరేందుకు అవకాశం ఉంటుంది. ఆ తరవాత ఎదుగుదల సంబంధిత వ్యక్తిని బట్టి ఉంటుంది. ఇతర రంగాలతో పోలిస్తే హోటల్ అండ్ హాస్పిటాలిటీ రంగంలో ఎదుగుదల ఎక్కువ.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ముందు చెప్పుకొన్నవి కోర్సు పరిభాషలో చెప్పాలంటే ఈ ప్రోగ్రామ్‌లో ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు బోధిస్తారు. ల్యాబ్ వర్క్‌లు కూడా ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

అడ్మిషన్ నోటిఫికేషన్

సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 11995 సీట్లు ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో

- తిరుపతిలోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో **60**
- హైదరాబాద్‌లోని సెంట్రల్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో **285**
- స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎం-డా.వైఎస్సార్ ఎన్ఐటీహెచ్‌ఎంలో **120**
- శ్రీశక్తి ఐహెచ్‌ఎం(ప్రైవేట్ కళాశాల)లో **120**
- మెదక్‌లోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో **60**

ఎంట్రెన్స్ టెస్ట్

న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్	30
రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్	30
జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్	30
ఇంగ్లీష్ లాంగ్వేజ్	60
ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి	50
మొత్తం	**200**

ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం
- **ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ తేదీ:** మే 11
- **వెబ్‌సైట్:** https://nchm.ntaonline.in/, https://exams.nta.ac.in/



ఎవరు రాజు?

ఒక అడవిలో సింహం ఉండేది. తనే రాజుగా ప్రకటించుకుంది. ప్రతి రోజూ తన దగ్గరకే జింకలు, తోడేళ్లు, పందులు.. ఇలా రోజూ ఒకటి ఆహారంకోసం రావాలని ఆజ్ఞాపించింది. దీంతో జంతువులన్నీ నిరసించాయి. అయినా రాజుగారు ఆజ్ఞ కాబట్టి తప్పలేదు. కుందేలు లాంటి జంతువులు వెళ్లినపుడు సింహం కోప్పడేది. అడవిలోకి వేటకు వెళ్లి జంతువులను భయభ్రాంతులకు గురిచేసేది. దీంతో సింహంతో ఏదోటి మాట్లాడాలని అనుకున్నాయి జంతువులు.

ఆ రోజే ఆ అడవిలోకి మదపుటేనుగు వచ్చింది. ఈ అడవికి నేనే రాజును అన్నది. మిగతా జంతువులన్నీ ఆశ్చర్యపోయాయి. అసలే సింహం బాధకు చస్తోంటే.. ఇదో తలనొప్పి అనుకున్నాయి. విషయం ఏనుగుకు



నక్క చెప్పింది. 'అయినా ఈ అడవిలో ఆ సింహాన్ని కొట్టే పరాక్రమం ఎవరికి ఉంది. ఊరికే పొడవు, ఎత్తు, బలం ఉంటే ఏం లాభం? బుర్ర ఉండొద్దా' అని ఉడికించింది ఏనుగును. దీంతో ఏనుగు ఇలా అంది.. 'ఈ అడవికి నేనే రాజును. ఎవరు వస్తారో చూస్తా' అన్నది. దీంతో జంతువులన్నీ ఏకమయ్యాయి. సింహం దగ్గరకు వెళ్లాయి. నేనే రాజు అంటూ రెండు ప్రగల్భాలు పలికాయి.

ఈ గొడవ కాస్త సద్దుమనగలేదు, దీంతో జంతువలకు ఇబ్బంది కలిగింది. నేనంటే నేను గొప్ప అనుకున్నాయి. ఇంతలో నక్క వచ్చి.. 'మీరు గొప్పవారు అని అనుకోవటం కాదు. అడవికి రాజు ఒకరే ఉండాలి' అన్నది. ఏనుగుతో 'నువ్వు జింకను పట్టుకుని రా' అన్నది. సింహంతో 'నువ్వు పెద్ద బండరాయిని తీసుకురా' అన్నది. అది కూడా సాయంత్రంలోపు చేయాలి అన్నది. రెండూ వేగంగా వెళ్లాయి. రెండూ వాటికి చెప్పిన పనులు చేయలేక వెనక్కి వచ్చాయి. నక్క వారితో ఇలా అన్నది.. 'మీరు ఎవరూ మీకు అప్పగించిన పనిని చేయలేకపోయారు. అంటే ఇద్దరూ కొట్లాడుకుని ఉపయోగం లేదు. జంతువులను సమానంగా చూడటం నేర్చుకోండి' అన్నది. ఆ తర్వాత ఏనుగు 'నేనే రాజు' అనలేదు. సింహం అలా రాజుగా ఉండిపోయింది.


శునకాలు ఎన్ని?



దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి



డైలీ సుడోకు - 256

	2		7	3				
3	4	7			2		6	
								7
4		8		5		2	3	
	6	5		1		7		8
1								
	7		4			5	1	9
				9	3		7	

సుడోకు - 255 సమాధానం

1	8	4	3	6	7	9	5	2
7	5	6	1	9	2	3	8	4
2	3	9	5	4	8	7	6	1
5	9	3	2	1	4	6	7	8
4	6	7	8	5	9	1	2	3
8	2	1	6	7	3	5	4	9
9	7	2	4	3	6	8	1	5
6	1	8	9	2	5	4	3	7
3	4	5	7	8	1	2	9	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.